క్లుప్తంగా

సచివాలయాల్లో సత్వర సేవలు లక్ష్యం

కోయవారిపాలెం(ప్రత్తిపాడు): సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీడీవో ఏ. శ్రీరమ్య తెలిపారు. మండల పరిధిలోని కోయవారిపాలెం గ్రామ సచివాలయాన్ని గురువారం మధ్యాహ్నం ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికలతో పాటు రికార్డులు పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పదేపదే ప్రజల్ని సచివాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయాల వారీగా అమలు చేయనున్నదని చెప్పారు. అర్హత ఉండీ పథకాలు పొందలేని లబ్ధిదారులు ఉంటే ముందుగానే వారిని గుర్తించి, సురక్ష కార్యక్రమం రోజున వారిని సచివాలయాలకు తీసుకువచ్చేలా ముందస్తుగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సెక్రటరీని ఆదేశించారు.

విజ్ఞాన్ విద్యార్థికి పీహెచ్‌డీ



చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన విద్యార్థి షేక్ సాయిబాబుకు పీహెచ్‌డీ పట్టా అందజేసినట్లు ఆ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. మినరాలజీ అండ్ జియోకెమిస్ట్రీ ఆఫ్ ద సెడిమెంట్స్ ఇన్ రివర్స్ అండ్ యాష్యురీస్ అలాంగ్ ద ఈస్ట్ కోస్ట్ ఆఫ్ ఇండియా అనే అంశంపై సాయిబాబు పరిశోధన చేశారని వీసీ పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన షేక్ సాయిబాబును ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.


నడింపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

నడింపాలెం (ప్రత్తిపాడు): మండలంలోని నడింపాలెం-1లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల్ని అందించారు. గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్ 39 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు అందించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. హెచ్‌వీ పద్మ, ఎంఎల్ హెచ్‌పీ సాయి, ఏఎన్‌ఎం పరమేశ్వరమ్మ పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది. సభ్యుల ప్రశ్నలు, ప్రతిపాదనలు, నగరపాలక సంస్థ ప్రీయాంబుల్స్ మొత్తం కలుపుకొని 432 అంశాలతో సమావేశం జరగనుంది. కౌన్సిల్ హాలు ముస్తాబు కావడంతో శుక్రవారం సమావేశాన్ని అందులోనే నిర్వహిస్తారు. ముందుగా కౌన్సిల్ హాలును కలెక్టర్, కమిషనర్‌తో కలసి మేయర్ ప్రారంభిస్తారు.

భక్తిశ్రద్ధలతో లక్ష మోదక హోమం



నగరంపాలెం: సంపత్‌నగర్ మెయిన్ రోడ్డులోని హరి సన్నిధి ఆధ్యాత్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం లోక కల్యాణార్థం లక్ష మోదక హోమం ఘనంగా నిర్వహించారు. గణపతికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, పుష్పార్చనలు చేశారు. 108 కలువలతో శ్రీమహాలక్ష్మి హోమాన్ని విశేషంగా నిర్వహించారు. గణపతికి సహస్ర మోదకాలతో మూల మంత్రంతో హోమాన్ని వేదోక్తంగా చేశారు. విశేష ద్రవ్యాలతో పూర్ణాహుతిగావించారు. వేద పండితుడు కోట నాగరాజశర్మ అవధాని మాట్లాడుతూ ప్రతి నెలా శుద్ధ చవితినాడు వంద నెలల పాటు సహస్రమోదక హోమం కొనసాగుతుందని తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి శ్రీమహాలక్ష్మి అనుగ్రహం కోసం హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పాటుపడాలి

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- చేబ్రోలు గ్రామాభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు, అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య సూచించారు. చేబ్రోలు గ్రామ సచివాలయం-1 వద్ద గురువారం సర్పంచ్ అత్తోట వినీతారాణి అధ్యక్షతన పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు సమస్యలు, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. పంచాయతీ పరిధిలో తక్షణమే 20 విద్యుత్ స్తంభాల్ని నాలుగు వార్డుల పరిధిలో వేయనున్నట్లు తెలిపారు. మరో పది స్తంభాల్ని కూడా త్వరలో వేయనున్నట్లు వివరించారు. జీబీసీ రహదారి పక్కన ఉన్న ముస్లిం, మైనార్టీలకు చెందిన ఖబరస్తాలో రూ.3లక్షలతో శ్లాబ్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వాటర్ ట్యాంక్ సమీపం నుంచి వెళ్లే డ్రెయిన్‌లో పూడికతీత చేపట్టాలని వార్డు మెంబర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వర్షాలు అధికమయ్యేలోపు వెంటనే యంత్రాల సాయంతో పూడికతీత చేసి, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును ఎమ్మెల్యే ఆదేశించారు. హిందూ శ్మశానవాటిక సమీపంలోని బావిని అభివృద్ధి చేయడానికి ఎస్టిమేట్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సీహెచ్. నాగేశ్వరావు, వార్డు మెంబర్లు నాగూల్ షరీఫ్, పెనుమోలు రాజేష్, శ్యామ్, చౌడయ్య, మణి, మెంబర్లు, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి, అర్హులైన వారు సాంకేతిక, ఇతర కారణాల వల్ల సంక్షేమ పథకాలు పొందలేకపోతే వారికి కచ్చితంగా అందించాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. చేబ్రోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం జగనన్న సురక్షపై ఆయన సమీక్ష నిర్వహించారు. గృహ సారథులు, పార్టీ నాయకులు, అధికారులకు చేపట్టాల్సిన అంశాల్ని తెలియజేశారు. అర్హతే ప్రామాణికంగా, అత్యంత పారదర్శకంగా, అవినీతి రహితంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే ప్రధాన ఉద్దేశంతో మరో చారిత్రక నిర్ణయానికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ నెల 24 నుంచి నేరుగా వలంటీర్లు, సచివాలయ గృహ సారథులు ఇంటింటికీ సమస్యల్ని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు

సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి



విద్యార్థులతో కలసి భోజనాన్ని తింటున్న సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి తదితరులు

గుంటూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్‌కు దీటుగా అన్ని వసతులతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ (ఏపీసీ) విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని నల్లపాడులోగల ప్రభుత్వ పాఠశాల్లో గురువారం మధ్యాహ్న భోజనం, పాఠశాల నిర్వహణ, పారిశుధ్యం తదితరాల్ని పరిశీలించారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పరిశుభ్రత సక్రమంగా లేకపోవడం, నిర్వహణ బాధ్యతగా తీసుకోకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో ప్రతి విద్యార్థికి విద్యను అందించేందుకు అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తోందని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం నల్లపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆర్వో ప్లాంటు, వంటశాల, విద్యార్థుల బాత్‌రూంలు పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయుల్ని అభినందించారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలో అభివృద్ధిని పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మెట్టు వెంకటప్పారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెదకాకాని: మండలంలోని సగరపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్త నియామకానికి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు పొన్నూరు సీడీపీవో ఎస్.వి. రమణ తెలిపారు. ఇంతకు ముందు పని చేసిన కార్యకర్త సూపర్‌వైజర్‌గా ఉద్యోగోన్నతి పొందడంతో ఖాళీ ఏర్పడిందని పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళలు జూన్ 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. నియమ, నిబంధనల మేరకు ఎంపిక జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: చోరీ కేసులో నలుగురు నిందితుల్ని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది నవంబరులో జీటీ రోడ్డులోని రియలన్స్ మార్ట్‌లో రూ. 5 లక్షల చోరీ జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు గురువారం అంకిరెడ్డిపాలేనికి చెందిన వడ్డమాను శివారెడ్డి, నరసరావుపేటకు చెందిన పులి అంజిరెడ్డి, పూనూరుకు చెందిన దేవరకొండ శ్రీను, సంతమాగలూరుకు చెందిన కుంభా పెద్దరోశయ్యను గురువారం అరెస్టు చేశారు.

వ్యక్తి మృతి

వ్యక్తి మృతి చెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గుజ్జనగుండ్లలో నివసించే ఆర్.కోటేశ్వరరావు (42) బుధవారం అరండల్‌పేట 12వ లైనులో నిర్మాణంలో ఉన్న ఇంటిలో రాడ్ బెండింగ్ పనులకు వెళ్లాడు. అక్కడే అనారోగ్యంతో కుప్పకూలి పోయాడు. స్థానికులు అతడ్ని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడి నివాసంలో చోరీ

పట్టాభిపురం: ప్రభుత్వ ఉపాధ్యాయుడి నివాసంలో భారీ చోరీపై కేసు నమోదైంది. పాత గుంటూరు పరిధిలో నివసించే అబ్దుల్ షబ్బీర్ అహ్మద్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 160 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి, రూ. 2 లక్షల నగదు అపహరించుకు పోయాడు. చోరీని గమనించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

బిల్డింగ్ పైనుంచి పడి కార్మికుడి మృతి



పట్టాభిపురం: భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసవీ నగర్ శివారు ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న ఒక అపార్టుమెంట్‌లో రాడ్ బెండింగ్ పనులకు వచ్చిన నల్లపాడుకు చెందిన మొదుగుమాల ఆదాం (48) ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి కిందపడి, అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు.

కాంపౌండర్ల సమస్యల్ని పరిష్కరించాలి



మంత్రి విడదల రజినితో కాంపౌండర్స్

గుంటూరు మెడికల్: రాష్ట్రంలో వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంపౌండర్ల సమస్యల్ని పరిష్కరించాలని శ్రీసాయి వెంకటేశ్వర కాంపౌండర్స్ అండ్ నర్సుల అసోసియేషన్ నేతలు కోరారు. గైనకాలజిస్టుల సంఘం కార్యదర్శి డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని గురువారం మంగళగిరిలోని ఆమె కార్యాలయంలో కలసి కాంపౌండర్స్ సమస్యల్ని వివరించారు. రాష్ట్రంలో వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏడు లక్షలకు పైగా కాంపౌండర్లు, నర్సులు పని చేస్తున్నారని, వారికి కనీస ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. కరోనా సమయంలో ఎంతో కష్టపడి పని చేసిన తమను ఆసుపత్రుల వారు అర్ధంతరంగా తొలగిస్తున్నారని వాపోయారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో తమకు అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ్రముట్ల నాగేశ్వరరావు, సెక్రటరీ గుంటుపల్లి నరసింహారావు, కోశాధికారి అనపర్తి వెంకట్రావు ఉన్నారు.

పార్టీలకతీతంగా నగరాభివృద్ధి

- మేయర్ కావటి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరి

నెహ్రూనగర్: పార్టీలకతీతంగా నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరంలోని 34వ డివిజన్ దేవాపురం, 2/19 బ్రాడీపేటలో, 35వ డివిజన్ పట్టాభిపురం కాంచన టవర్స్ వద్ద కల్వర్టుల నిర్మాణానికి గురువారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థకు నూతన పాలకవర్గం ఏర్పడ్డాక అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. అన్ని డివిజన్లలో కుల మత, పార్టీలకతీతంగా పనుల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రధాన రహదారుల విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారన్నారు. నగరాభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ నగరాభివృద్ధికి పార్టీలకతీతంగా కట్టుబడి ఉన్నామన్నారు. ప్రస్తుతం గుంటూరు నగరంతో పాటు, నగరపాలక సంస్థ విలీన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో రూ. 75కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. మరికొన్ని టెండర్ దశలో ఉన్నాయని, ఇంకా కొన్నింటికి ప్రతిపాదనలు కూడా చేస్తున్నామని వెల్లడించారు. టెండర్ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు తెలిపారు. అధికారులు కూడా పనుల్ని పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బూసి రాజాలత, ఈరంటి వరప్రసాద్, 35వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ టి.యల్.వి. ఆంజనేయులు, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ రఫిక్, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో పాఠ్యాంశాల బోధన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఎంఈవో కెనడీ, ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు: ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాలు బోధించాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ నిర్ణీత టైంటేబుల్ ఫాలో అవుతూ సిలబస్‌ను ఇన్‌టైమ్‌లో పూర్తి చేయాలని చెప్పారు. విద్యార్థులకు నూటికి నూరు శాతం జగనన్న విద్యాకానుక కిట్లు అందించాలన్నారు. జగనన్న గోరుముద్ద క్వాలిటీగా, క్వాంటిటీగా ఉండేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిన్నర గంటల్లోగా యాప్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ఏ ఒక్క విద్యార్థి పేరు మిస్ అవ్వకుండా చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలని తెలిపారు. మండలంలోని పదహారు గ్రామ పంచాయతీల్లో ఎక్కడా డ్రాపవుట్స్ లేకుండా సీఆర్పీలు పర్యవేక్షించాలని ఎంఈవో స్పష్టం చేశారు. ఈ నెలాఖరులోగా నాడు-నేడు పనులను పూర్తి చేయాలని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తూ కోట్ల రూపాయల వ్యయంతో పాఠశాలల రూపురేఖల్ని మారుస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారుల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విన్నవించారు. సమావేశంలో ఎంఈవో-2 జి. లీలారాణి, జెడ్పీ హైస్కూల్స్ హెచ్‌ఎంలు హెచ్. శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించి, పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల బదిలీపై కాకుమాను మండలానికి వచ్చిన పలువురు ఉపాధ్యాయుల్ని సన్మానించారు. ఎంఈవో -2 విజయ్ భాస్కర్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిల్టర్, క్లోరినేషన్ నీటినే సరఫరా చేయాలి



మైక్రో వాటర ఫిల్టర్ వద్ద పంప్ ఆపరేటర్‌తో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్

నడింపాలెం (ప్రత్తిపాడు): గ్రామంలోనికి ఫిల్టర్, క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్ తెలిపారు. మండలంలోని నడింపాలెంలో రక్షిత మంచినీటి పథకాన్ని గురువారం పంచాయతీ కార్యదర్శి ఖాజాతో కలసి ఆయన పరిశీలించారు. ఫిల్టర్‌బెడ్‌కు మరమ్మతులు చేయించినా, బ్లీచింగ్ అందుబాటులో ఉన్నా, మైక్రోఫిల్టర్ పని చేస్తున్నప్పటికీ బుధవారం గ్రామంలోకి రా వాటర్‌ను సరఫరా చేశారు. దీంతో ఏఈ మైక్రోవాటర్ ఫిల్టర్‌ను పరిశీలించారు. రా వాటర్ సరఫరా చేయడానికి గల కారణాల్ని పంప్ ఆపరేటర్‌ను ప్రశ్నించారు. మైక్రోఫిల్టర్‌కు అందించే బావిలోని నీటికి ఫుట్‌బాల్ అందకపోవడంతో రా వాటర్‌ను సరఫరా చేయాల్సి వచ్చిందని పంప్ ఆపరేటర్ చెప్పడంతో ఆయన ఆగ్రహించారు. మరోసారి ఇలా చేస్తే కుదరదని, కచ్చితంగా ప్రతి రోజూ నీటిని ఫిల్టర్ చేసి, బ్లీచింగ్ కలపి క్లోరినేషన్ చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

టీజేపీఎస్ కళాశాలకు నూతన యాజమాన్యం



నూతన యాజమాన్యం

నగరంపాలెం: స్థానిక టీజేపీఎస్ కళాశాలకు నూతన యాజమాన్యం ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. కళాశాల అధ్యక్షుడిగా బొమ్మిడాల శ్యాంసుందర్, కార్యదర్శి అండ్ కరస్పాండెంట్‌గా కె.వీరబ్రహ్మం, వాసవి విద్యా నిధి కమిటీ అధ్యక్షుడిగా పొట్టి సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. కళాశాల ఆవరణలో గురువారం కార్యదర్శి కె.వీరబ్రహ్మం మాట్లాడుతూ 52 ఏళ్ల చరిత్ర కలిగిన టీజేపీఎస్ కళాశాల ఎందరో విద్యార్థులకు మంచి జీవితాల్ని అందించిందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ఉన్నత ర్యాంకులు సాధించిన పేద విద్యార్థులకు సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

అంకినీడు స్ట్రోక్ సెంటర్‌కు క్యూఏఐ అక్రిడిటేషన్

- దేశంలో దక్కించుకున్న మొదటి సెంటర్
- సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ పమిడి ముక్కల విజయ వెల్లడి



డాక్టర్ విజయను అభినందిస్తున్న ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ నేతలు

గుంటూరు మెడికల్: బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు సకాలంలో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో క్వాలిటీ సేవలందిస్తున్నందుకు గుంటూరు లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చెందిన అంకినీడు అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్‌కు క్వాలిటీ అక్రిడిటేషన్ అండ్ ఇన్‌స్టిట్యూట్ (క్యూఏఐ) గుర్తింపు లభించింది. దేశంలోనే మొట్టమొదటి సారిగా క్యూఏఐ గుర్తింపు తమ సెంటర్‌కు దక్కడం సంతోషంగా ఉందని సీనియర్ న్యూరాలజిస్టు, లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పమిడిముక్కల విజయ చెప్పారు. కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. దేశంలో మొట్టమొదటిసారిగా చెన్నైలో స్ట్రోక్ యూనిట్ ప్రారంభించగా, 1996లో రెండోది తాము గుంటూరులో ప్రారంభించామని వెల్లడించారు. తమ స్ట్రోక్ సెంటర్‌లో పక్షవాత బాధితులకు అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలకు పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అవార్డుల్ని అందజేశాయని ఆమె తెలిపారు. ముంబైలోని ఓ హోటల్‌లో జూన్ 17న నేషనల్ పీడియాట్రిక్ స్ట్రోక్ సదస్సు నిర్వహించారన్నారు. ఇందులో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, ఇండియన్ అకాడమి ఆఫ్ న్యూరాలజీ, ఇతర స్ట్రోక్ యూనిట్ సెంటర్ల నిర్వాహకులు తమ సెంటర్‌కు గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తం చేసి ఘన సన్మానం చేసినట్లు ఆమె వెల్లడించారు. సమావేశంలో స్ట్రోక్ సెంటర్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ కిరిటీ, డాక్టర్ రామచంద్ర, డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ భార్గవి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ అన్నపూర్ణ

నగరంపాలెం: మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలతో జీవితాలు దుర్భరంగా మారతాయని సెబ్ గుంటూరు సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ చెప్పారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా గురువారం ఎస్‌ఈబీ (సెబ్) గుంటూరు-2 స్టేషన్ ఆధ్వర్యంలో నల్లచెరువు మహవీర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి తాగినా, పట్టుబడినా చదువుకు ఆటంకం ఏర్పడుతుందని, తద్వారా ఉద్యోగావకాశాలు ఉండవని చెప్పారు. స్థానికంగా ఎవరైనా గంజాయి విక్రయిస్తే సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 14500కు తెలియజేయాలని కోరారు. సమాచారం చెప్పిన వారి వివరాల్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ కె.మణికంఠ, సెబ్-1 సీఐ ఎం.రమేష్, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రం .. బీకేర్ ఫుల్ బ్రదరూ !



ప్రత్తిపాడు: ఇదో చిన్నపాటి టీవీఎస్ మోపెడ్. చిత్తు కాగితాలు సేకరించే నిమిత్తం గోతాల తరలింపు కోసం ఈ రెండు చక్రాల వాహనాన్ని కాస్తా నాలుగు చక్రాల వాహనంగా మార్చేశారు. అంతటితో ఆగకుండా ఇదిగో ఇలా.. ఇద్దరు మాత్రమే ఎక్కాల్సిన వాహనంపై ఏకంగా పిల్లాపాపలతో కలసి ఏడుగురు ప్రయాణిస్తున్నారు. వాహనానికి వెనుక భాగంలో ఉన్న రిక్షాకు చుట్టూ కనీస రక్షణ, జాగ్రత్తలూ తీసుకోకుండా రోడ్లపై పసికందులతో రయ్‌రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. ఇక హ్యాండిల్ ముందు వెనుక కూడా గోతాల్ని పెట్టుకుని ప్రమాదభరితంగా ప్రయాణిస్తున్నారు. పొరబాటున పసివాళ్లకు పట్టు తప్పినా ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. ఈ చిత్రం గురువారం ప్రత్తిపాడులోని గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై సాక్షి కెమెరాకు కనిపించింది.

మళ్లీ చెత్త .. అదే రోత



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయ ఎదురు రోడ్డుపై చెత్త

ప్రత్తిపాడు: స్థానిక పంచాయతీలో పారిశుద్ధ్యం పడకేస్తోంది. నిన్నమొన్నటి వరకు మెరుగ్గా అనిపించినప్పటికీ, కొద్ది రోజులుగా ఎటు చూసినా అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. అందుకు దర్పణమే ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రం. ఇదేదో మారుమూల బజారో లేక జనం తిరగని ప్రాంతమో కాదు. సాక్షాత్ ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదురు. జెడ్పీ పాఠశాల పక్కన, రైతుభరోసా కేంద్రం, హెల్త్ సబ్ సెంటరు వ్యవసాయశాఖ కార్యాలయం, ఎస్సీ బాలికల హాస్టల్స్‌కు వెళ్లే రోడ్డు ఇది. ఇక్కడే ఇలా రోజుల తరబడి చెత్తను ఎత్తివేయకుండా ఉంటే.. ఇక అంతర్గత వీధుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో వేరే చెప్పాల్సిన పనిలేదు. పంచాయతీ అధికారులు పూర్తిగా పారిశుద్ధ్య నిర్వహణను విస్మరించడంతో ఇలా సీసీ రోడ్లు వెంబడి చెత్తచెత్తగా డంపింగ్ యార్డుల్ని తలదన్నేలా వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ఆయా పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ముక్కుపుటాలదిరే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ప్రత్తిపాడు డివిజన్

90109 57733 (ప్రత్తిపాడు)

90109 62225 (పొన్నూరు)

Office mail : sakshigntadvt@gmail.com